క్లుప్తంగా

నేడు శలపాడులో కళ్లజోళ్ల పంపిణీ

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా అక్టోబర్ 29న శలపాడులో నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన 559 మందికి బుధవారం పంపిణీ చేయనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వెల్లడించారు. సాయంత్రం 3 గంటల నుంచి 5 వరకు మహిళలకు, 5 గంటల నుంచి 7 వరకు పురుషులకు గ్రామంలోని బొడ్డురాయి వద్ద కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

అన్నపర్రు సర్పంచ్ శ్రీనివాసరావు మృతి



పెదనందిపాడు: మండలంలోని అన్నపర్రు సర్పంచ్ అన్నపర్తి శ్రీనివాసరావు(52) గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆయన అనారోగ్యంతో రెండు రోజుల కిందట గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చేరారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జెడ్పీటీసీ సభ్యురాలు కల్లూరి అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యుడు కల్లూరి నాగేశ్వరరావు తదితరులు ఆయన భౌతికాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన

తెనాలి: సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ముస్లిం సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనను నిర్వహించారు. స్థానిక శివాజీ సెంటరులోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యాలయం, జామియా మసీదు వద్ద నుంచి ప్రదర్శనను ప్రారంభించారు. లిబరేషన్ దేశవ్యాపిత పిలుపులో భాగంగా చేపట్టిన ప్రదర్శన గాంధీచౌక్, బోసురోడ్డు, చినరావూరు పార్కు వరకు కొనసాగింది. యుద్ధం వద్దు... శాంతి కావాలి, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఆపాలి అంటూ నినాదాలు చేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మూర్తి, జిల్లా కార్యదర్శి ఎంపీ రాందేవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణకృష్ణ, లోకం భాస్కరరావు, ముస్లిం సంస్థల నేతలు పాల్గొన్నారు.

నీరే జీవితం.. జీవితమే నీరు



నెహ్రూనగర్: నీటి శుభ్రతపై మహిళలు అవగహన కలిగి ఉండాలని మెప్మా పీడీ పి. వెంకట నారాయణ, నగరపాలక సంస్థ డీఈఈ హనీఫ్ తెలిపారు. అమృత్ 2.0, దీన దయాళ్ అంత్యోదయ యోజన కార్యక్రమంలో భాగంగా నేషనల్ లైవ్లీ హుడ్ మిషన్ ఆధ్వర్యంలో 'నీటి దీపావళి' పేరిట నీళ్ల కోసం మహిళలు, మహిళలు కోసం నీళ్లు అనే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించాలని ఆదేశించింది. ఇందులో భాగంగా మంగళవారం తక్కెళ్లపాడులోని హెడ్ వాటర్ వర్క్స్‌లో మహిళలకు నీటి శుద్ధీకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రమైన నీరు తాగాలని సూచించారు. నీరే జీవితం ...జీవితమే నీరని పేర్కొన్నారు. ప్లాంటులో నీటి శుద్ధీకరణ ప్రక్రియను మహిళలకు దగ్గరుండి డీఈఈ హనీఫ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈ సాంబశివరావు, సీఎంఎం నాయక్, లత, ప్రభావతి పాల్గొన్నారు.

హైవేపై సర్వీస్ రోడ్లను వినియోగించాలి



నగరంపాలెం: జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలు, ఆటోలతో ప్రయాణించవద్దని ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు సూచించారు. జాతీయ రహదారులపై ప్రమాదాల్ని నిలువరించేందుకు మంగళవారం సాయంత్రం గుంటూరు– విజయవాడ– చిలకలూరిపేట రహదారిపై వాహనదారులకు ట్రాఫిక్, రవాణాశాఖ సంయుక్తంగా అవగాహన కల్పించాయి. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు మాట్లాడుతూ జాతీయ రహదారులకు అనుబంధంగా ఉన్న సర్వీస్ రోడ్లను ద్విచక్ర వాహనదారులు, ఆటో రిక్షాల యజమానులు, చోదకులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఏ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించవద్దని ఆయన తెలిపారు. ఇటీవల జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలన్నీ ద్విచక్ర వాహనాల వల్లేనని చెప్పారు. ఏదైనా ప్రమాదంలో ఎవరైనా మృతి చెందితే ఆ కుటుంబాల బాధను వర్ణించలేమని తెలిపారు. ద్విచక్ర వాహనాలు, ఆటో రిక్షాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్లల్లోనే ప్రయాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఊపిరితిత్తులకు కాలుష్యం కాటు

పెరుగుతున్న వాతావరణ కాలుష్యంతో నేడు ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ప్రతి ముగ్గురిలో ఒకరు బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 2.02 మిలియన్లు, మన దేశంలో 70వేల మంది దీని బారిన పడుతున్నారు. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నవంబర్‌ను లంగ్ క్యాన్సర్ అవగాహన నెలగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

– గుంటూరు మెడికల్

- వాతావరణ కాలుష్యమే ప్రధాన కారణం
- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చు
- ఇది లంగ్ క్యాన్సర్ అవగాహన మాసం



ధూమపానం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణం. మరణాల్లో 80శాతం సంభవించటానికి ఇదే కారణం. సిగరెట్లు, హుక్కా, గంజాయి పీల్చడం క్యాన్సర్‌కు దారితీస్తుంది. కాలుష్య పొగలు, వాహనాల కాలుష్యం, రేడియేషన్, వాతావరణ కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నాయి.

వీరికి ప్రమాదం ఎక్కువ

పొగతాగేవారికంటే వారి పక్కన ఉండే వారే ఎక్కువగా లంగ్ క్యాన్సర్ సోకుతోంది. ట్రాఫిక్ పోలీసులకు, టోల్‌గేట్ వద్ద పనిచేసే సిబ్బందికి, క్వారీలు, మైనింగ్, తారు రోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణాల పనుల్లో పాల్గొనేవారికి వ్యాధి సోకుతోంది. పొగ తాగడం అలవాటు లేని ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల్లో 65 శాతం మంది మహిళలు, 35 శాతం మంది పురుషులు ఉన్నారు.

వ్యాధి బారిన వారంలో ఇద్దరు లేదా ముగ్గురు ...

గుంటూరు జిల్లాలో 20 మంది పల్మనాలజిస్టులు, 30 మంది క్యాన్సర్ వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు వారంలో ఇద్దరు లేదా ముగ్గురు బాధితులు ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడి చికిత్స కోసం వస్తున్నారు.

వ్యాధి లక్షణాలు

- విడవకుండా దగ్గు రావడం
- దగ్గులో రక్తం పడటం, ఆకలి లేకపోవడం
- ఛాతిలో నొప్పి, గొంతు బొంగురు పోవడం
- బరువు తగ్గిపోవడం
- ఎముకలు, కీళ్లు, వెన్ను, నడుంనొప్పి ఎక్కువ కాలం ఉండటం,
- శ్వాస సరిగా ఆడకపోవడం
- నిద్రలో గురక రావడం

జాగ్రత్తలు అవసరం

ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే తొలుత పొగ తాగకూడదు. తాగే వారి పక్కన కూడా ఉండకూడదు. ప్రతిరోజూ కొద్దిపాటి వ్యాయామాలు చేయాలి. వారానికి ఐదు యాపిల్ పండ్లు తింటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. బీటా కెరోటిన్ పోషకాహారం తీసుకోవడం ద్వారా లంగ్ క్యాన్సర్ బారిన పడే ముప్పును

అందుబాటులో ఆధునిక వైద్యం



క్యాన్సర్‌లను గుర్తించేందుకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో ఒకరికి లంగ్ క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా ఉత్తమం. లోడోస్ సిటీ స్కాన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా సెంటీ మీటర్ కన్నా తక్కువ సైజులో ఉన్న గడ్డలను సైతం నిర్ధారణ చేయవచ్చు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణురాలు, గుంటూరు

వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలి



వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతున్న దృష్ట్యా 40 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. పలువురు సకాలంలో చేయించుకోవడం లేదు. వ్యాధి నిర్ధారణ చేసే సమయానికి క్యాన్సర్ మూడో దశలో ఉన్నట్లు గుర్తిస్తున్నాం. ప్రాథమిక దశలోనే గుర్తించే ఎండో బ్రాంకియల్ ఆల్ట్రాసౌండ్, థ్రయోతొరకోస్కోపి వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

జగనన్న సురక్షతో ప్రజారోగ్య పరిరక్షణ



కిట్లను పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు

గుంటూరు రూరల్: పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించి ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు తెలిపారు. మండలంలోని చల్లావారిపాలెంలో మంగళవారం సర్పంచ్ ఆరుదల సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్య సమస్యలున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప అవకాశమని తెలిపారు. ఖరీదైన వైద్యంతో పాటు మందులు కూడా ఉచితంగా క్యాంప్‌లో అందిస్తున్నట్లు చెప్పారు. మండల ఇన్‌చార్జి ఎంపీపీ ఇంటూరి పద్మావతి మాట్లాడుతూ జగనన్న విద్యా, వైద్యరంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారని చెప్పారు. అనంతరం నేతలు క్యాంప్‌లో ఏర్పాటు చేసిన మహిళల, పురుషుల ప్రత్యేక కౌంటర్లు పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యల్ని తెలుసుకున్నారు. ఉన్నత వైద్యం అవసరమైతే ప్రభుత్వం లేదా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రిఫర్ చేస్తారని తెలిపారు. శిబిరంలో వైద్యులు బీపీ, షుగర్, గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులు, కీళ్లు, కళ్ల సమస్యలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, మిర్చి యార్డ్ డైరెక్టర్ బందలపాటి వెంకటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్, దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, కిశోర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహనతోనే మెరుగైన సమాజం



విద్యార్థినులకు అవగాహన కలిగిస్తున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్

పెదకాకాని: వినియోగదారులంతా హక్కులు, బాధ్యతలు తెలుసుకున్నట్లయితే మెరుగైన సమాజాన్ని స్థాపించవచ్చని న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ సురేష్ మిశ్రా తెలిపారు. మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం వినియోగదారుల రక్షణ చట్టం-2019పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ సురేష్ మిశ్రా, రాష్ట్ర కన్స్యూమర్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యుడు పి.వి.వి.ఎస్. మూర్తి హాజరయ్యారు. సదస్సుకు పెదకాకాని తహసీల్దార్ పి. రత్నం అధ్యక్షత వహించారు. విద్యార్థులకు వినియోగదారుల ప్రాథమిక హక్కులు, బాధ్యతల్ని ప్రొఫెసర్ సురేష్ మిశ్రా వివరించారు. ఏ వస్తువునైనా కొనేటప్పుడు తూనికలు, కొలతలు, కాలపరిమితి, గరిష్ట ధర, ఐఎస్ఐ మార్కులను చూడాలని సూచించారు. విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా కుటుంబంలోని వారందరికీ వినియోగదారుల హక్కులపై అవగాహన ఏర్పాడాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి పి. కోమలి పద్మ మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం నాలుగు పాఠశాలల్లో విద్యార్థులకు హక్కులు, బాధ్యతలపై నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల ఒకటని తెలిపారు. కార్యక్రమంలో డీసీఐసీ చదలవాడ హరిబాబు, తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి, ఎంఈవో డి. బలిరాం, పాఠశాల ఉపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు, సహాయ పౌర సరఫరాల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీవీఐటీలో అన్వేషి చిత్ర బృందం సందడి



పెదకాకాని: యువ నటీనటులు విజయ్ ధరన్, సిమ్రాన్ గుప్తా హీరో హీరోయిన్లుగా వకీల్ సాబ్ ఫేమ్ అనన్య నాగళ్ల కీలకపాత్రలో నటించిన అన్వేషి చిత్ర బృందం మంగళవారం వీవీఐటీని సందర్శించింది. వీజే కన్నా దర్శకత్వంలో అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంటు బ్యానర్‌పై మిస్టర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న అన్వేషి చిత్రం ఈనెల 17న విడుదల కానున్న నేపథ్యంలో ప్రచారంలో భాగంగా కళాశాలలో సందడి చేశారు. ఈ సందర్భంగా చిత్ర హీరో విజయ్‌ధరన్ మాట్లాడుతూ ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు మంచి స్పందన లభించిందని తెలిపారు. చిత్రంలో మంచి సారాంశం ఉందని, తప్పక విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు. కార్యక్రమంలో చిత్ర నటులు విజయ ధరన్, సిమ్రాన్ గుప్తా, జబర్దస్త్ హాస్యనటులు నాగి, నరేష్, వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

వీరయ్యకు ఘన నివాళులు



వీరయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దయాసాగర్

పెదనందిపాడు: విజయవాడ బస్టాండ్‌లో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రావిపాడు గ్రామానికి చెందిన యడ్లపల్లి వీరయ్య భౌతికకాయానికి మంగళవారం మధ్యాహ్నం మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరమని తెలిపారు. వీరయ్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట మండల కన్వీనర్ షేక్ ఖాశింపీరా, సాంస్కృతి విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, పెదనందిపాడు సర్పంచ్ దాసరి పద్మారావు, నేతలు జెట్టి శ్రీనివాసరావు, కారుమూరి పుష్పరాజ్, మొవ్వా శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పోర్టిఫైడ్ బియ్యంపై అపోహలొద్దు



పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌సీఐ తాడేపల్లి కృష్ణాకెనాల్ డిపో మేనేజర్ వర్గీస్

తాడేపల్లి రూరల్: పోర్టిఫైడ్ బియ్యం వినియోగంలో అపోహలు వద్దని ఎఫ్‌సీఐ తాడేపల్లి కృష్ణాకెనాల్ డిపో మేనేజర్ వర్గీస్ అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఆహార సంస్థ ఆహార నిల్వల గోదాము, కృష్ణా కెనాల్ డిపో ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటైన ఆహార లోపాన్ని నిర్మూలించడానికి భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోర్టిఫైడ్ బియ్యం వాడడం వల్ల రక్తహీనత, సూక్ష్మ పోషకాల లోపాలను నివారించవచ్చని తెలియజేశారు. కృష్ణా కెనాల్ ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ శశికళ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కావాల్సిన ఐరన్, ఫోలిక్ ఆమ్లం, విటమిన్ బి12లు ఈ బియ్యంలో లభ్యమవుతాయని వివరించారు. ఆశా వర్కర్లు పోర్టిఫైడ్ బియ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్, సిహెచ్ గురుకుమార్, సి.ప్రమాజా, ఉమాదేవి, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఏ శ్రీనివాస్‌బాబు, తాడేపల్లి కేసీ డిపో సిబ్బంది, క్వాలిటీ సిబ్బంది, ఆశావర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రెండు చోట్ల చైన్ స్నాచింగ్

గుంటూరు ఈస్ట్: మహిళల మెడలో బంగారు గొలుసులు తెంచుకుని పరారైన ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏటీ అగ్రహారం 8వ లైనుకు చెందిన ఇంద్రాణి మంగళవారం ఇంటి ముందు నిలబడి ఉంది. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని రెండు సవర్ల బంగారు గొలుసును తెంచుకుని పరాయ్యారు. ఇంద్రాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పండరీపురం 4వ లైనుకు చెందిన శ్రీలక్ష్మి మంగళవారం నడుచుకుంటూ 5వ లైనుకు వెళ్లింది. ఈ సమయంలో ఇద్దరు ఆగంతకులు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోని బంగారు గొలుసును తెంచుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. శ్రీలక్ష్మి ప్రతిఘటించి గొలుసును గట్టిగా పట్టుకుంది. లాకెట్‌ను మాత్రమే ఆగంతకులు తెంచుకుని పరారయ్యారు. శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

బాలిక అదృశ్యంపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సంగడిగుంటలో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక సోమవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వ్యక్తి ఆత్మహత్యపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీసీ కాలనీకి చెందిన షేక్ ఖలీల్ (36) గతంలో బట్టల షాపు నిర్వహించి నష్టాల పాలయ్యాడు. అప్పులు చేసి మానసికంగా కుంగిపోయాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్ బైండోవర్

చేబ్రోలు: మండలంలోని సుద్దపల్లికి చెందిన రౌడీషీటర్‌ను మంగళవారం పోలీసులు తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ ముందు హాజరుపరిచారు. గ్రామానికి చెందిన ఎస్. సురేష్‌పై 2008, 2009, 2019 సంవత్సరాలలో మొత్తం నాలుగు కేసులు ఉన్నాయి. చేబ్రోలు పోలీసు స్టేషన్‌లోనూ రౌడీషీట్ ఉంది. మంగళవారం ఉదయం గ్రామంలోని సెంటర్‌లో న్యూసెన్స్ చేస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో పోలీసులు వెళ్లి అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దారు ముందు బైండోవర్ చేశారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఉన్నతికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ తెలిపారు. కాకుమాను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఎంఈవో -2 కె.విజయ్ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయం ప్రారంభం

గుంటూరు మెడికల్: ఆమ్ ఆద్మీ పార్టీ తూర్పు నియోజకవర్గ కార్యాలయాన్ని బుధవారం మంగళగిరి రోడ్డులోని వైష్ణవి కాంప్లెక్స్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ టి.సేవకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలో తూర్పు నియోజకవర్గం ఓటర్ల లిస్టు అందుబాటులో ఉంటుందని, ఓటరు సహాయ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఓటర్లంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

15న విజయవాడలో ఉపాధ్యాయుల మహా ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 15న ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని సంఘ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. బసవ లింగారావు, మొహ్మద్ ఖాలీద్ కోరారు. మంగళవారం జిల్లాకోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గుడిపాటి దాస్, వి. వందనం, కె. శ్రీనివాసరావు, ఏ. వేణుగోపాలరావు, టి. ప్రభాకర్, సత్యనారాయణ మూర్తి, పి. వేణు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసిన వారికే మాదిగ మద్దతు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

తెనాలి టౌన్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేసిన రాజకీయ పార్టీకే మాదిగల మద్దతు ఉంటుందని, వర్గీకరణ కోసం పోరాటం చేస్తూనే సంక్షేమం, సమగ్రాభివృద్ధి, రాజకీయ వాటా కోసం మాదిగలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ పొన్నెకంటి రమేష్‌మాదిగ అధ్యక్షత వహించారు. సమావేశంలో బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ మాదిగల ఆశ, ఆకాంక్ష, ఎస్సీ వర్గీకరణ అని పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభలో దేశ ప్రధాని నరేంద్రమోడీ పాల్గొంటారని చెప్పారు. పార్లమెంట్‌లో వర్గీకరణ అంశంపై చట్టం చేయాలని బ్రహ్మయ్య మాదిగ డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రమేష్ మాదిగ, ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ, దొండపాటి సుధాకర్, పానుగంటి షాలేమ్ రాజు, డొక్కా జార్జి, మహిళ నాయకులు లుక్కా బుజ్జి, ప్రశాంతి, నాగమ్మ, యువకులు జాన్‌పాల్, రమేష్, సంతోష్, జాన్‌వెస్లీ, ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో పీపీటీ ఫెస్ట్



మాట్లాడుతున్న అమరేశ్వరరావు

తెనాలి టౌన్: పాఠ్యాంశాలలో లోతైన అవగాహనకు, పరిశీలనకు పీపీటీ ప్రజంటేషన్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని ప్రియదర్శిని డిగ్రీ అధ్యక్షులు బొల్లిముంత అమరేశ్వరరావు తెలిపారు. కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో మంగళవారం పీపీటీ ప్రజంటేషన్‌ల పోటీలు జరిగాయి. పోటీలను అమరేశ్వరరావు ప్రారంభించి మాట్లాడుతూ పాఠ్యాంశాలలో ముఖ్యాంశాలను, సమకాలిన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను పీపీటీల రూపంలో విద్యార్థులు రూపొందించి ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరం కళాశాలలో క్రమం తప్పకుండా పీపీటీ ఫెస్ట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో విద్యార్థులు నెట్‌వర్కింగ్, 5జీ, సోషల్ మీడియం, వర్చువల్ రియాల్టీ తదితర అంశాలపై రూపొందించిన పీపీటీలను ప్రదర్శించి నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బొల్లిముంత శివరామకృష్ణ, కంప్యూటర్ అధ్యాపకులు వేదాంతం శ్రీ సుధ, నయాబ్ రసూల్, ఆరీఫా పాల్గొన్నారు.

సీవీ రామన్ స్ఫూర్తితో శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశం గర్వించే గొప్ప శాస్త్రవేత్త సీవీ రామన్ స్ఫూర్తితో విద్యార్థినులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి సూచించారు. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ జయంతిని మంగళవారం సాంబశివపేటలోని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థినులు బయో సెన్సార్, నానో మెటీరియల్స్ ఇన్ టెక్స్‌టైల్స్ అండ్ త్రీడీ ప్రింటింగ్ అంశాలపై పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర అధ్యాపకురాలు జి. శిరీష, డాక్టర్ జె. నిశ్చల్ కిరణ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సాహసం



గుంటూరు ఈస్ట్: మహిళ బ్యాగును ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ ఆమెకు అప్పగించి ప్రశంసలు పొందాడు. తూర్పు గోదావరి జిల్లా కయ్యపులంకకు చెందిన ఎస్.సునీత మంగళవారం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సోదరుడ్ని పలకరించడానికి గుంటూరు వచ్చారు. బస్టాండ్ వద్ద ఆటో నుంచి కిందకు దిగుతుండగానే వేగంగా వెళ్లిపోయింది. బంగారు నగలు, విలువైన వస్తువులు ఉన్న బ్యాగు ఆటోలో ఉండి పోయింది. సునీత కేకలు వేయడం గమనించిన ఈస్ట్ హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ విషయం తెలుసుకుని ద్విచక్ర వాహనంపై ఆటోను వెంబడించాడు. కొంత దూరం వెళ్లిన తరువాత దాన్ని అడ్డగించి అందులోని బ్యాగును స్వాధీనం చేసుకుని సునీతకు బ్యాగు అప్పగించాడు. సాహసించి ఆటోను వెంబడించి, బ్యాగును అందజేసిన ప్రసాద్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.